కథానిక:

శ్రామికుడు

శ్రీ బలివాడ కాంతారావు

1944 ఏప్రిల్ 1వ తేదీన విశాఖపట్నంలో ఆర్డినెన్సు డిపో (*Ordnance Depot*) లో గుమాస్తాగా చేరాను. క్రొత్తగా తెరవబడివదవటంవల్ల అట్టే పనిలేదు. పుస్తకాలు తెరచిన డ్రాయరులో పెట్టి చదువుకోవటం, పక్కవాడితో బాతాకానీలోకి దిగటం తప్పించి యింకేపనీ లేదు.

మా ఆఫీసుకు యెదురుగానూ, వెనకస్థలంలోనూ కొందరు డిపో కూలీలు అప్పుడే తోటవేసే ప్రయత్నంలో వున్నారు. ఆ గేంగ్ మేస్త్రీ దుబ్బుగా చెయ్యెత్తు పొడుగు భారీమనిషి. చామనచాయగా వుండేవాడు. వయసు అరవై పడిలో వుంటుంది. పండిన మీసాలు బాగా ఒత్తుగావుండి గొర్రెపోతు కొమ్ముల్లా తిరిగున్నయ్. తలకి యెత్తైన పాగాచుట్టి, బొజ్జను గట్టిగా పట్టివున్న మోటు బనియను వేసేవాడు.

పనీపాటూ లేని నేను పనిపాట్లు చేసుకునేవాళ్ళ వేపు అప్పుడప్పుడు దృష్టి పోనిచ్చేవాడిని. ఒకనాడు ఉబుసుపోక "నీ పేరేంటోయ్" అని అడిగాను. "అప్పన్న బాబో" అన్నాడు. కానీ నేను తరవాత ఆ పేరెట్టి యెప్పుడూ పిలవలేదు. ముసలివాడికి పర్యాయపదంలా "తాతా" అనే పదమే ఉపయోగించేవాడిని. రానురాను మా పరిచయం ద్విగుణీకృతమైంది. నేనొకనాడన్నాను. "గేంగ్ మేస్త్రీవి. కూలీలచేత నువ్వు పనిచేయించాలి గానీ—నువ్వే పని చేస్తావెందుకు?"

"ఎవరు సేస్తే యేంవుంది బాబో—తోట యేపుగా పెరగాలి గానీ" అంటూనే పారపట్టుకొని నేలను గొప్పుపెట్టున్నాడు.

ఎండనక, వాననక, కూలీలు పనియెగవేసినా పనిచేస్తుండేవాడు. లంచ్‌టైమ్‌లోకూడా తాతను తోటలో పనిచేస్తుండగా చూశాను. చెమట నీరులాకారి మొక్కలమీద పడేది. పైనుంచి బొప్పాయ్, కొబ్బరి, అరటి యిత్యాది మొక్కలన్నీ తెచ్చి నాటేవాడు. మట్టుటెండలో మొక్కలు నాటడం చూసి "అవన్నీ పెద్దవై కాస్తాయా" అన్నాను.

మొక్కను పాత్తూనే "ఓర్సు బాబో—ఓరిస్తే కోడిగుడ్డుసట్టి డొలుతుందంటారు." అన్నాడు. ఇదివరకెప్పుడూ వినని యీ పల్లె సామెత వినగానే నేను మాటాడలేకపోయాను.

ఆ వారంలోనే ఒకనాడు తాత ఒక కవరు తీసుకొచ్చాడు. వాడి కొడుకు వ్రాసిన వుత్తరం అది. వంద తప్పులతోనూ, వంకర టింకరలతోనూ వుంది. చదివి వినిపించాను. అంతావిన్నాక చర్రున లేస్తూ "ఆదూ, అది తలలోని పేనే వస్తాది. యెదవకి సాలాకాలం బట్టి ఒళ్లు బలుసెక్కిపోనాది" అన్నాడు.

"నువ్విలా అంటే యెలా తాతా? వాడికి సెలవు దొరకద్దూ" అన్నాను. "ఇదంతా యేసం బాబూ! ఆడెంత మిలిటరీవోడైపోయినా యీ జెబ్బవంచేనేడు నే. ఈనాడు కాకపోతే యింకోనాడు రాడా?"

"ఏం వొచ్చింది?" అన్నాను అసలు గుట్టు లాగుదామని.

"ఎందరు పోనారు? ఆడొక్కడేనా. ఆ గుంట పుట్టిన దగ్గిరనుంచీ యీడిపేరే యెట్టేసాం. మాదగ్గిరోళ్లే. రారా పెళ్లి సేస్తానూ అంటే యీడికి గోరోజనం యెక్కువైనాది. యీడికి పెద్ద పెళ్ళాం కావాలట!"

"మంచిదేకాదా" అన్నాను.

"అదా బాబూ సెప్పినావు. ఇప్పుడు పెద్దదాన్ని సేస్తే యీడింకా రెండు, మూడేళ్ళదాకా మిలిటరీనించి రాడుకదా—అదేం తిరుగులు తిరిగితే నా మీసం వుండెందుకూ? ఈ గుంటని సేసుకుంటే ఆడొచ్చేసరికి కాపరానికొస్తాది." అంటూ వుత్తరం పట్టుకొని వెళ్లిపోయాడు.

అప్పుడప్పుడు తాత పనిచేస్తూనే మంచి మంచి కబుర్లు చెప్పేవాడు. తోట యిన్స్పెక్షన్ (*Inspection*) చేస్తున్నట్లు అక్కడక్కడే తిరిగి తాత మాటలు వింటుండేవాడిని. రంగూన్‌లో దర్వానుగా వుండేటప్పుడు చూపించిన పౌరుషాన్ని, యజమాని మెచ్చియిచ్చిన బహుమానాన్నిగూర్చి చెప్పాడు. నేను అడిగాను. "అయితే రంగూన్‌లో యేమాత్రం గడించావ్?"

"గడింపు! కడుపుకిబాగా తిన్నాను. రోజు కోక్కోడియే సోలం. తిన్నదే దోదకోలు—జపానోడు బాంబులేసేటప్పుడు యిలా ఒల్లు దిట్టం లేకపోతే నడిసిరాగలవాఁ బాబో" అన్నాడు. నిజవేఁ అన్నట్లు నా తల నాకు తెలియకుండానే వూగివుంటుంది. బర్మావాళ్ళ ఆచార వ్యవహారాలు, డిపోకు మూడుమైళ్ళదూరంలో వున్న వాళ్ల పల్లె విషయాలుకూడా చెప్తుండేవాడు.

ఆ నెలలోనే ఒకరోజు ఉదయం పనిలోనికి రాగానే నా టేబిల్ దగ్గరకువచ్చి "నా కొడుకు వచ్చాడు బాబూ—వచ్చే వారంలో పెళ్లి" అన్నాడు.

"ఆపిల్ల నేనా?" అన్నాను.

"దాన్ని కాక—నేం వుండగా ఆడియాట సెల్లుతాదా?"

నాలో రేగిన సంశయంకొద్దీ "యింత తొందరేం వొచ్చిం" దన్నాను.

"పెద్ద గాడిదనా వున్నాడు. ఆడి కింకా సెంబుడి నీరు పొయ్యకపోతే వూళ్ళోవాళ్ళేమనిపోతారు? పెళ్ళయినాక పోకిరీయే పాలు మాని ఆడి సంసారానికి ఆడే గడ్డేసుకుంటాడు."

నే నేమీ మాటాడలేదు. ఏక్టివ్ సర్వీసులోని కెళ్ళబోయే వాడి కెందు కంటగట్టడమని నే ననలేకపోయాను. పెళ్ళికి వెళ్ళ లేదు గానీ ఆ విషయాలన్నీ తాతద్వారానే విన్నాను. ఏకరాత్రిలో డుబ్—డుబ్ మనిపించేశారు.

ఏనాలనాడు తాగడానికీ మాంసాలకీ ఖర్చు, పెళ్ళిఖర్చు కంటే హెచ్చే అయ్యిందట.

౨

కాలగర్భంలో కొన్ని నెలలు క్రుంగిపోయాయ్. తాత యథావిధిగా కష్టపడుతున్నాడు. చరిత్రలో ఆరోజుల్లో తెచ్చిన తీవ్రమైన మార్పులు నాలో సంశయాలను రేగగొట్టినా తాత నిశ్చింతగా వున్నట్లు గుర్తించాను. 1947 సంవత్సరంలో కాలుపెట్టాం. మే మున్నది అతి తాత్కాలిక వ్యవహారశాఖ కాబట్టి దినదిన గండంగా బ్రతుకుతున్నాం.

ఒకరోజు తాతను పిలిచాను. చెప్పాను. తాత ముక్కుమీద వేలు వేసుకొని "తెలీక అడుగుతాను గానీ—యీ ఆఫీసులు మూసేస్తే—యీ సెట్టులు, యీయన్నీ దండగే కదా" అన్నాడు.

"నేవల్ ఆర్మమెంటుడిపో వాళ్ళకి యివన్నీ అప్పచెప్తా" రన్నాను.

"ఆలు మనల్ని తీసుకోరా?" అన్నాడు.

"ఇప్పుడు మన అవసరం లేదు" అన్నాను.

"పోనీలే బాబూ—పుట్టించినోడు పెట్టకపోడు. ఆ వొచ్చిన మారాజులేనా యీతోట ఫలసాయం తింటే పున్నెమేనా వస్తాది." అంటూ వెళ్ళిపోయి తోటపనిలో నిమగ్నుడైపోయాడు.

1947 మార్చి 31 తేదీ—ఆవేళ నేను యిటూ అటూ పని మీద పరుగెత్తుతున్నాను. తాతకు ఆఖరిరోజు అదే. మట్టమధ్యాహ్నమప్పుడు గాలిదుమారం రేగింది. నే నప్పుడే కేంటీన్లో భోజనం చేసి వస్తూ దుమారంలో చిక్కుకున్నాను. ఎలాగో ఆఫీసు చేరుకునేసరికి తాత తోటలో పనిచేయటం గమనించాను. రెండు బొప్పాయిచెట్లు కూలిపోయినాయ్. మిగతా చెట్లు కూలిపోకుండా కొయ్యలు పాతటం గమనించాను. దుమారం ఆగాక తోటలోనికి వెళ్ళాను. కూలిపోయిన చెట్లదగ్గర నిల్చుని గాలిని తిట్టూ విచారిస్తున్నాడు. "ఈవేళతో నీకూ యీ తోటకూ సంబంధం తెగిపోయిందికదా—ఎందు కింత శ్రమపడుతున్నా" వన్నాను.

"ఇంత పెద్దకాయలు కాసేవి యీ సుట్టుపట్టున నేవు బాబో—తుంటరి గాలి కడుపు నేసుకుం" దన్నాడు. వాడి బాధ స్ఫుటంగా అగుపించింది. కొంచం దగ్గరగా వెళ్ళి "రేపటినుంచీ యేం చేస్తావు తాతా?" అన్నాను.

"ఎక్కడో కూలిపని"

"దొరుకుతుందా?" అన్నాను.

"నే నేం పాపం సెయ్యనేదు బాబో—పొట్టై కరవటానికి, నిజంమీద యెళ్ళేవోడికి బగమంతుడు నిజంగానే సూత్తాడు."

నా యెదరగా వున్న నిదర్శనంబట్టి "నా కేం నమ్మకం లేదు తాతా" అన్నాను. తాత వాడిపోయిన ముఖంలో చప్పున నవ్వు ప్రత్యక్షమయింది. "రా బాబో! వయసులో గడించిన డబ్బైనా వయసొచ్చిన కొడుకైనా వుండా లంటారు. ఆ గాడి దున్నాడు గాదా? అలాగే గడిసిపోతాది." అభినయంతో నోటి తుంపరలు పైకి విరజిల్లి యీ మాటలు పూర్తిచేసినవెంటనే, నేను చెప్పాను "వాళ్ళకి గుమాస్తాలే కావాలట! మన దొర నన్నురికమండు చేశాడు. నేవీవాళ్ళు నన్ను రేపటినుంచి తీసుకుంటున్నారు." తాతముఖం చేటంతయ్యింది. నవ్వుతూ "మంచిది బాబో రాత కోతా సేతనైన బాబువి. నీపాపకొన మాక్కూంత యేనాడైనా ఆదరువు దొరుకుతాది." అన్నాడు.

3

నేను నేవల్ ఆర్మమెంటుసర్వీసులో చేరిన వారంలోనే యెవరైనా బొంబాయి బదిలీమీద వెళ్తారా అని అడిగారు. బొంబాయి చూడాలని చాలాకాలంనించి వుండటంవల్ల మొదటి వాలంటీరును నే నయ్యాను. అదీ కాకండా మా పెదనాన్న అల్లుడు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ యిండియాలో పనిచేస్తున్నాడు. ఇక్కడలా హోటల్లో బాధపడే అవసరం లేదు.

బొంబాయిలో 1949 జూన్ నెలాఖరువరకు వున్నాను. తరవాత తూర్పుకోస్తాకు బదిలీకోసం మా నాన్న వుత్తరాలలో బలవంతంచెయ్యటంవల్ల ప్రయత్నించాను. అదృష్టవశాత్తూ విశాఖపట్నం బదిలీఅయ్యింది. జూలై మొదటివారంలో పనిలో చేరాను.

ఒకనాడు మొదటి ఆట సినీమానించి గేటుదాటి రోడ్డుమీదకు వచ్చాను. కారుహారను విని ప్రక్కకు తప్పుకుంటుంటే 'బాబో' అన్న కేక పేలవంగా వినిపించింది. ఎక్కడో విన్న గొంతుకలా వుంది. ఆగి చప్పున చుట్టూ చూశాను. వస్తున్న కారును లక్ష్యంచెయ్యకండా ఒక రిక్షా నావేపు వస్తోంది. "సాలాకాలానికి కనపడ్డావు. కూర్సో బాబో నాగేస్తాను" అన్నాడు. గొంతుకబట్టి తాత అనుకున్నానే గానీ ఆ మనిషిని చూస్తూ అలా స్తబ్ధుడ నయ్యాను. ట్రాఫిక్ఒత్తిడివల్ల అక్కడ నిల్చొనే అవకాశం లేక పది గజాలు ముందుకు సాగాం. ఆ జంక్షన్లో మెర్కురీబల్బు వెలుగుతోంది. ఆ వెలుగులో బక్కచిక్కిన ముసలిగుబ్బింలా దీనంగా మృత్యువును మౌనంగా పలకరిస్తున్నట్లున్న ఆ యెముకల పోగును చూశాను. తలమీద చింకి తలపాగైనా లేదు. మూతిమీద మీసాలు ఆకలికి చచ్చిపోయినయేమో! కళ్ళు అరంగుళం లోతుకు పోయాయ్.

కుంభాకారంగా వున్న కడుపు పుటాకారంగా మారింది. నాకయింకొక క్రొత్త కనిపించింది. పాదాలకు చింకి కెట్స్... నన్ను రిక్షామీద కూర్చోమని బలవంతం చేస్తున్నాడు. ఆ రిక్షా యెక్కితే నేను చాలా బరువుమనిషి నైపోతాను.

నా వెనకాలే రిక్షాతోనే మెల్లగా నడుస్తూ కుశలప్రశ్నలు వేస్తున్నాడు. నా సంగతి వేగంగా తేల్చేసి, తాత యిలా చిక్కిపోటానికి కారణ మేమిటని అడిగాను. "ఏదైనా జబ్బు గాని పడ్డావా?" అన్నాను. "తిండికి లేకపోవట మే జబ్బు" అన్నాడు. తరవాత హీనస్వరంతో చెప్పుకొచ్చాడు. "కూలి నేసినా కడుపుకి సాలేది కాదని యీ గాడీ కొనుక్కున్నాను. అదు అప్పుడే మిలిటరీనుంచి యెలిపొచ్చినాదు. పనిపాట్లు సెయ్యడు. కూలిపని కెల్లమంటే యెల్లడు. పోనీ గాడైనా నాగరా కూలీపనికి నాను ఎల్తానంటే నా సెక్కితౌనుగాని నాసతౌనా అంటాడు. నెలజీతం వొచ్చిన నౌకరీ చూపించు, నేస్తాను అంటాడు. నా సెక్కడ సూపించేది బాబూ. నా కే మారాజుల్ని తెలుసని? ఇలా రేతిరిపగలు, గాడీ నాగి, సానీరుమీద పాణం నిలబెట్టుకొని వోరానికి రెండు దపాలు యింటి కెల్తాను. పూరవతలే కొల్సి సగం డబ్బు నాగేస్తాడు. పెళ్ళాన్ని వొదిలేసినాడు. సానీరు రోజుకి యినమాటు వుండాలి. సిగిరెట్లు కాల్చడం యింతా అంతా కాదు. వోరానికి మూడు దపాలు పస్నెం బైస్కోపులకని వస్తాడు. బేరాలు వదిలేసి ఆడిని కూర్చోబెట్టి గాడీ నాగాల. ఆ యన్నిటికి నాను డబ్బివ్వాల. లేక పోతే తంతా నంటాడు. ఇన్నాళ్ళాగ పిక్కబలం వున్నాదిగన కనా ఆడిని యెదిరించటానికి. ముసిలివానిమీద సెయిసేసుకుంటాడు......"

ఇంతలో సందులోవున్న నా లాడ్జిని చేరుకున్నాం. తాళం తీస్తూ "అప్పుడప్పుడూ కనిపిస్తూవుండు. ఇక్కడే వుంటాను" అన్నాను.

"అలాగే బాబో—నన్ను మరిసిపోకండి" అన్నాడు చేతులు నులుపుతూ.

నేను ఆగాను.

"ఆ యెదవని మీ పాదాలదగ్గిర పడేసుకోండి."

"ఇప్పుడు ఖాళీలు లేవు. అయినా అలాంటివెధవ వళ్లు వంచి కష్టపడుతాడా ?"

"బాబో బాబో...నాలుగు నీవాట్లు తమరే పెట్టురుగాని... మరిసిపోకండి."

"చూద్దాంలే" అని ఒక పూత పదం పారేశాను. కాని లోపలకు వెళ్లాక కుర్చీకి చాలసేపటివరకు అంటుకుపోయాను. కష్టపడిన వాడి బ్రతుకు యిదీ !!

తాత అప్పుడప్పుడూ వస్తుండేవాడు. కొడుకు వుద్యోగంవిషయమై జ్ఞాపకంచేసి వెళ్లిపోయేవాడు. అప్పుడప్పుడూ రోడ్డుమీద యెదురుపడినా, వెనుకనించి బరువుతో వస్తున్నా నన్ను చూడగానే మెల్లగా పోతూ "దండం బాబయ్యా" అనేవాడు. ఒకనాడు సాయంత్రం నేను వచ్చేవరకు కూర్చునివున్నాడు. నా ఆలస్యానికి కారణం చెప్పాను.

"ఇంకెప్పుడం పోనేండి బాబూ ప్రారకేయిస్తే" అన్నాను.

"తోటలు పెంచటానికి డబ్బు వొంటు ఇప్పిస్తారు. అందుచేత ఆతోట ఫలసాయం చవగ్గా పనివాళ్లకే అమ్మి, ఆ డబ్బుతో విత్తనాలు యెరువులు కొని తోట బాగుచేయమని దొర చెప్పారు" అన్నాను.

"ఏం యితనాలు కొన్నావుబాబూ" అన్నాడు.

"అన్నీ యింగ్లీషువిత్తనాలే."

"పేరు పెద్ద వూరు దిబ్బ—అటికంటే మన దేశవాళీవి సాలా మంచి"వన్నాడు.

నేను నవ్వి యింకోవిషయం చెప్దామని ప్రయత్నంమీద ఆపుకొన్నాను. తాత "నల్లమందుపిసరు నేను బాబో"అన్నాడు. నే నావిషయం గ్రహించనట్టుగానే "దున్నపోతుల్లాంటివాళ్లని ఎలా లాగుతున్నా"వన్నాను.

"దన్నపోతులా! కొడుబాబో - సాలా మంచోల్లు - ఏదో ఆలెక్కబట్టి మానోటికి బుక్కెడు గంజి."

"ఇద్దరేసి యెక్కి, లావ్సులా వూలిస్తూ—"హేళనంగా అన్నాను.

"సైకిలు రిక్షాలు వచ్చినాక నూరేర మే పడిపోనాది. అలాంటోలు నల్లమందు పిసరకేనా యిస్తారు."

"అంత తక్కువకు లాగుతున్నావా?" అన్నాను.

తాత ప్రసన్నవదనంతో "రా బాబో! కానీసాని బతికిందా రూపాయి సాని బతికిందా ? అదే పదేలు."

ఈ సామెతలు నానోటికి తాళాలులా పనిచేస్తున్నాయ్. అవి మరచిపోకండా మనసులో ఎన్నోసార్లు అనుకోవటంతో అసలు విషయాన్ని విడిచిపెట్టుంటాను.

అసలు తాత యెందుకొచ్చాడో కొంతసేపటికిగానీ జ్ఞప్తికి రాలేదు. నా జీవితవిధానంలో, నా రాబడి బట్టి నేను పేదవాడినే. పొదుపుగా ఖర్చు పెట్టుకున్నా కాఫీ త్రాగకుండా గడిపిన రోజులు లేకపోలేదు. పావలా కాసు తీసియిచ్చాను. సంతోషంగా తీసుకొని వెళ్లిపోయేముందు కొడుకు వుద్యోగం విషయం జ్ఞాపకంచేశాడు. అప్పుడు, ఆవేళ విత్తనాలు తెమ్మని డబ్బిచ్చేటప్పుడు యెస్టాబ్లిష్ మెంట్ ఆఫీసరుతో మాట్లాడిన విషయం చెప్దామనుకున్నాను. గాని మళ్ళీ చెప్పకపోవట మే మంచిదని "చూద్దాం" అనే పదం పారేశాను.

ఆ వారంలోనే రెండుసార్లు కనిపించాడు. మొదటిసారి కొడుకు వేషాలు గూర్చి కళ్లల్లో నీటితో చెప్పుకొచ్చాడు. భరించలేని కోపంతో ఏదో అనేశాడు. రెండోసారి కొంచెం సర్దుకొని చెప్పాడు. నా కోపంను, నా మాటకు యెంత విలువయిస్తున్నాడో ఆ వేళే కొంచెం అర్థం చేసుకున్నాను.

మూడోసారి తెల్లవారేసరికి ఒంటిగానే వచ్చాడు. "రిక్షా ఏదీ" అని అడిగాను.

ఈ ప్రశ్నకు వెంటనే తాతకళ్లు నీటి మయమైపున్నాయ్. ముందుసారివచ్చి చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చాయ్.

"చెప్పు తాతా—ఏమైందో" అన్నాను, మనిషిగతుక్కు మనటం గుర్తించాను. కట్టుకున్న చింకి మాసిన గుడ్డపీలికతోనే వంగి కళ్లు వత్తుకుంటూ "వారంరోజులైనాది జేరంతగ్గిపోనాది... నల్లమందు పిసరుకే డబ్బు నేకపోతే...ఆడియేసాలకి డబ్బు ఎక్కడ తేను...కోపంవచ్చి రాతిరి గాడీ యిరిసేసినాడు."

వెక్కుతున్న యీ మనిషి ఒకప్పుడు రంగూన్‌లో వీరుడని స్మరించి యిలాంటి దృశ్యాన్ని చూడవలసివచ్చినందుకు బక్కచచ్చిపోయాను. చాలసేపటికి.

"ఏం చెయ్యదలచావ్ ?" అన్నాను.

"ఏంసేస్తాను—ఇక అడుక్కుతినటమే—ఆ డక్కడ... నానిక్కడ..."

"ఇంతచేసిన ఆ వెధవని యింటినుంచి తగిలేలేక పోయావా ?"

"పూరోలు యేవఁనిపోతారు—యెంతసేసినా కనుకున్న పేణం. మనిసి మిగల్దుగానీ మాట మిగిలిపోతాది...ఆడు పంపిన డబ్బుతోనే పెళ్లి సెయ్యగా మిగిలినదాంతో గాడీ కొన్నాను. ఆడి డబ్బు ఆడే కాల్సుకున్నాడు."

నా కోపానికి యెంత విలువవుందో నాకర్ధమయింది. యెంతసేసినా కనుకున్న పేణం అనే తాతమాటలు నా చెవుల్లో గింగురుమనటంవల్ల మౌనం దాల్చాను.

వెళ్లిపోయేముందు "మరిసిపోకు బాబో" అన్నాడు. తల ఆడించటానికైనా నాకు శక్తిలేకుండా పోయింది.

౪

ఆదివారం—నేను యింటికిరావటం చాలా ఆలస్యమైంది పేటింగ్‌లో పూతకర్ర వుంచబట్టి తాతను చప్పున పోల్చుకోలేకపోయాను.

"కర్రపట్టుకున్నావేం తాతా" అన్నాను.

"తిన్నగావడిస్తే యే బాబు ధర్మం సేస్తాడు ? కర్రపట్టుకొని సొట్టగా నడిసి కేకలేసి గుమ్మ గుమ్మానికి యెత్తే యే యమ్మకైనా కనికారం పుట్టాది..." అన్నాడు.

ఈసారికూడ కొడుకు విషయం జ్ఞప్తికి తెచ్చాడు.

ఆ వారంలోనే తాత మనుషులవెంట "ఒక్కానీ పడేయండి బాబూ...మీ తల్లీదండ్రికి పుణ్యంవుంటుంది బాబూ" అంటూ పడటం చూశాను.

ఒకరోజుసాయంత్రం కాఫీహోటల్లోనికి వెళ్దామని మొదటి మెట్టుమీద కాలు వేసేసరికి ఆ మెట్టుదగ్గరగా గప్పున తాత కూర్చుండటం చూశాను. తాతా అని పిలుచుంటే యేమయ్యేదో—గట్టిగా మూతిని బిగించుకున్నాను. కానీ తాత అరుస్తున్నాడు "గుడ్డివాడ్ని బాబయ్యా! నాలుగు—రోజులై కడుపు మాడిపోతంది బాబయ్యా...మీ తల్లీదండ్రికి పుణ్యం వుంటుంది బాబయ్యా..."

నేను వేసిన బేడకాసు తడుముకుంటూనే "ఈ మారాజుని బగమంతుడు ఒకకంట నూస్తాడు" అన్నాడు. కళ్లుమూసుకొనివున్న తాతవేపు అలా చూస్తుంటే ఆ ప్రక్కనే యింకోమనిషి "సొట్టదాన్ని బాబయ్యా...వారంరోజులై కడుపు మాడిపోతంది బాబయ్యా..."

ఇలాగ ప్రపంచంలో అరిచేవాళ్లందరూ నా చెవిదగ్గరే అరుస్తున్నట్లనిపించింది. వచ్చినదారంటే తలవంచుకొని లాడ్జికివెళ్లిపోయి రుమాలుతీసుకున్నాను.

ఈ సంఘటన తరవాత తాత కొన్నిరోజులవరకూ అగపడలేదు. కనపడినా చూడలేకపోయేవాడినేమో !

ఆ నెలలో ఆఖరివారం. వాకది "పాపర్ వీక్". అసలే అప్పుపుట్టటంలేదు. రెండుసార్లు అగ్రికల్చర్ డిమాన్ స్ట్రేటరు ఆఫీసుకెళ్లాను. డిమాన్‌స్ట్రేటరు చివరకు రానందుకు విసుక్కుంటూ యింటికొచ్చాను. అప్పటికి చీకటిపడింది. ఆ చీకట్లో వాకిట ఎవరో కూర్చున్నట్లు దూరంనించే చూశాను. నా కోసం కూర్చునేవాడు తాతే అనుకున్నాను. యేం వచ్చిందో యేంటో అని అనుమానిస్తూనే వున్నాను. బాధపడుతున్నవాళ్లకే యింకొకరిబాధలు అగుపిస్తాయ్. సానుభూతి తప్పించి యింకేవిధమైన సహాయంచెయ్యటం సాధారణంగా జరగదు.

నేను దగ్గరకువెళ్లగానే తాత భూల్లున యేడుస్తూ రెండు పాదాలమీద పడిపోయి "నా కొడుకుని రచ్చించుబాబో" అని నాలుగుసార్లు నెత్తిని నా పాదాలమీద కొట్టుకున్నాడు.

లేవదీసి "ఏం వచ్చింది తాతా" అన్నాను.

"వారంరోజులైనాది. జొరంకాస్తంది. అదే పోతాదనుకున్నాం. మిలిటరీలో సర్రున సీదితే డాక్టేరు వస్తాడు. ఇంత జొరంవస్తే డాక్టేరుని ఎందుకు తేరని ఒకటేగోల—యీ సిన్నజొరానికి డాక్టేరేలని వూరుకున్నాను. యిప్పుడు వాకిటేసేశాం. వయిదుగుడు బాబుదగ్గిరికెత్తే జట్కా కరుసికి మందు కరుసికి పది రూపాయలు తెమ్మన్నాడు. నా దగ్గిరసిల్లిగవ్వ నేదు..."

ఆ చివరివాక్యం నేనూ మనసులో అనుకున్నాను. చప్పున—మాటాడలేకపోయాను. తాత శరీరం కుష్కించినట్లుగానే మనోధైర్యంకూడ కుష్కించిపోయిందని ఆ యేడుపే చెప్తోంది.

"ని న్నేం బాగుచేశాడులే ఆ వెధవ" అన్నాను.

"అంతేఅన్నావా బాబో ! ఇంత హీనస్థపడి యెందుకు బతికున్నాను ? ఆడిని నూసేనా? నేదా అంటే ఏ నూతిలోనో గెడ్డలోనోపడి సావనా ?"

తాత యీ మాటలు శోకంతో తబ్బిబ్బైపోతూ అంటున్నాడు. కానీ నా పరిస్థితి నన్ను తబ్బిబ్బు చేస్తోంది.

"ఆడు బాబుకి కోపం తెప్పించినాడు. నాను మీ పాదాలు పట్టుకున్నాను. సెమించండి, నా ముడుకుల్లో సెక్తినేకపోతే ఆడుంటే తిట్టో కొట్టో బుక్కెడు గంజి పోస్తాడు."

నేను స్తంభించి పోయాను.

"ఆడుసస్తే మునిలిది యేం నూతిలోనోపడి సస్తాది. ఆ లిద్దరూ సస్తేనానుండి యేం సేస్తాను ? ఆడుంటేనే నా వంశం నా బతుకూనూ. అంతా ఆడేనాకు, నాను ఆడికోసవేఁ పుట్టాను... ఆడి కోసవేఁ రంగంవెళ్లాను...ఆడికోసవేఁ గాడీనాగాను.—ఆడి

కోసవేం సద్దోస్తని, పంటోడ్నని యేసాలేసి అడుక్కుతిన్నాను బాబో..."

ఈ బాబో అనేస్వరం వెయ్యిగొంతుకలు కలిసి యేడ్చేటట్లు నాకు వినిపించింది. నీరునిండిపోయిన కళ్లకు నా చుట్టుప్రక్కల కొందరు నిల్చొని వున్నట్లు గమనించాను. తలుపు తోసి లోపలకు వెళ్లి కుర్చీమీద వాలిపోయి జుత్తుపీక్కున్నాను.

కొంతసేపటికిగాని గాబరాపడ్డ నా మనసుకు ఒక విషయం జ్ఞప్తికిరాలేదు. ఇన్నాళ్లకి నా సంశయం తీర్చుకోడానికి అదను దొరికింది. తాతను లోపలికిపిల్చి పదిరూపాయలనోటు చేతిలో పెట్టూ "రేప్రొద్దున్నవచ్చి యెలావుందో చెప్పు" అన్నాను.

కాళ్లకుముద్దులాడి చీకటిలో లీనమయ్యాడు. ఆ రాత్రి నేను చేసినపనివల్ల ఆ మరుచటిరోజు ఆఫీసుకు శలవుపెట్టవలసి వచ్చింది.

ఉదయం తాత అగపడలేదు. నిరాశచేసుకున్నాను. మరుచటిరోజు ఎస్టాబ్లిష్‌మెంటు ఆఫీసర్‌తో చెప్దామనుకున్నాను. "ఖాళీ వస్తే యే ఎక్స్‌సర్వీస్‌మెన్‌ని వేస్తాననుకున్నావో వా డీప్రపంచాన్ని విడిచిపెట్టాడని"

సాయంత్రమైంది. ఉదయంనుంచీ తెలిసినవాళ్లందరినీ సిగ్గువిడిచి అడగ్గా పదిరూపాయలు అప్పు పుట్టింది. ఆ డబ్బుతో ఎగ్రికల్చర్ డిమాన్‌స్ట్రేటరు ఆఫీసుకువెళ్లి వచ్చేసరికి చాలా ఆలస్యమైంది.

నన్నుచూడగానే తాత ఒక్క నవ్వు నవ్వి చేతులెత్తాడు. "నోరల్లాపల్లే, ఊరల్లా పెజలే. ఎందుకుబాబో? నీలాంటి బాబులు పదిమందుంటే సాలదా?" అన్నాడు.

తరవాత కొడుక్కుకొంచెం నయంగా వున్నట్లు, బ్రతుకుతాడని ధైర్యంగా చెప్పాడు. నా నోరు పెగల్లేదు. తాతవెళ్లిపోయాక అలా కూర్చొనే ఆలోచించుకుంటున్నాను. తాత ఒకనాడు చెప్పిన—మాటలు జ్ఞాపకానికి వచ్చాయ్. "నిజంమీద యెత్తే వోడిని బగమంతుడు నిజంగానే నూస్తాడని."

ఆ పదిరూపాయలు తాత వేసిన తోటఫలసాయం అమ్మగా వచ్చినది. ఎరువులకోసం ముందురోజు ఆ డబ్బుపట్టుకొని రెండు సార్లు తిరిగినా డిమాన్‌స్ట్రేటరు అగపడలేదు. ఎందుకగపడలేదనేదే ఒక జవాబు చెప్పలేని పెద్దప్రశ్న...

ఇదంతా చెప్తే తాతమాత్రం జవాబు చెప్పగలడని నా ఉద్దేశం—ఆచిన్న నవ్వుతోనే అంటాడు. "వన్నురచ్చించింది—నా సెవలే" అని.

ప్రైస్లిస్టు (క్యాటలాగుతో) ...... కోరినవారికి పంపబడును.



ఆఫీసు వేళలు: ఉ. 9-0 గం. నుండి మ. 1 గం. వరకు: సా. 4-0 గం. ల నుండి రా. 7 గం. ల వరకు. 'ఆదివారం' శలవురోజు.